

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 244 పేజీలు - 08 వెల - 05/- ఆదివారం 30-08-2026


## గిరిజన ఆరోగ్యానికి

# రూ.250 కోట్లు



- ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట
- 31న వెలిగొండకు కృష్ణాజలాలు...సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు
- అరకు నియోజకర్గం గన్నెలలో సంజీవని కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**మారుమూల ప్రాంతాల్లోనూ చెంతకే వైద్యం**

**రూ.250 కోట్లతో గిరిజన ఆరోగ్య మిషన్**

**ఆదివాసీల అభివృద్ధికి ఐదు సూత్రాలు అమలు**

**గత పాలనలో బలవంతపు మత మార్పిడులు**

**జే బ్రాండ్ల మద్యంతో ఆరోగ్యం నాశనం చేశారు**

**గ్రూప్-1 అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు**



అరకు, ఆగస్టు 29:- మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైద్యం కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా వైద్యం వారి దగ్గరకు రావాలన్న దే ప్రజా ప్రభుత్వం సంకల్పం అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించేలా చేపట్టిన సంజీవని తో ప్రతీ ఒక్కరి ఆరోగ్యాన్ని సంరక్షిస్తామని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టును త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అరకు లోయ నియోజకవర్గం గన్నెలిలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద ముఖ్యమంత్రి ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, అదే నిజమైన అభివృద్ధి అని చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతాలకు మెరుగైన వైద్య సదుపాయాల కోసం రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు అందించే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. అల్లూరి జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు గిరిజనులకు ఆయుర్వేద వైద్యాన్ని అందించారని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని చెప్పారు.

మిగతా 2లో

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న

● ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి ● తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం ● భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్ ● సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు





ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం

మిగతాది 2లో



## గత ప్రభుత్వానికి నరకడం తప్ప... నాటే ఆలోచనే రాలేదు

- కూటమిది నరికే సంస్కృతి కాదు... నాటే సంస్కృతి
- భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- ప్రకృతి, ఆధ్యాత్మికతల అద్భుత సమ్మేళనం "అశ్వత్థ నారాయణ వివాహం"
- అరణ్యారామంలో రావి--వేప మొక్కలు నాటిన శ్రీ నాగబాబు దంపతులు
- ప్రకృతి సంరక్షణలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలి

హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ శ్రీ కొణిదెల నాగబాబు గారు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో సాంప్రదాయ రావి--వేప మొక్కల నాటే కార్యక్రమంలో శ్రీ నాగబాబు గారు, సతీమణి శ్రీమతి పద్మజ గారు కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ నాగబాబు దంపతులు రావి--వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ "భూమాత మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి. మనం పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులను భూమాత నుంచే పొందుతున్నాం.

మిగతాది 2లో

## ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ లేఖ

- తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం





తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ౘ×=) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో

మిగతాది 2లో

### యానాం రేవులో పులస

## సందడి..

● గోదావరి జిల్లాల్లో మొదలైన పులస చేపల సీజన్ ● యానాం వేలంలో రెండు చేపలకు రికార్డు ధర ● మొత్తం రూ. 31,500కు పులసలను దక్కించుకున్న మహిళ



2

## నెల్లూరు రైతులకు సాగునీరు అందించాలి!

● శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్న కాకాణి ● సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న ● నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని



2

### ఇంధనం, ఎరువుల సరఫరా

## పై ప్రభావం

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది.

మిగతాది 2లో

## నోటీసులకు 7 రోజుల్లో వివరణ ఇవ్వాలి

● ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కలెక్టర్లతో తెలంగాణ సీఈవో సమీక్ష ● బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందించాలని ఆదేశం ● విచారణకు రెండు రోజుల ముందే ఓటర్లకు సమాచారం ఇవ్వాలని స్పష్టం ● నోటీసులకు వారం రోజుల్లోగా వివరణ ఇచ్చే నిబంధనను కఠినంగా అమలు చేయాలి





రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీని అత్యంత నిక్కచ్చిగా, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని

మిగతాది 2లో

### అమరావతిలో

## 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి వారి అకాడమీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించామన్న రవీంద్ర
- రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించామని వెల్లడి
- ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి





ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని

మిగతాది 2లో

### తెలుగు రాష్ట్రాలకు వర్ష

## హెచ్చరిక

● బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ● తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా ● ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేడు ఉరుములతో కూడిన వానలు ● హైదరాబాద్‌లోనూ వర్ష సూచన, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



2

# యానాం రేవులో పులస సందడి.. వేలంలో రికార్డు ధర

గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ మొదలైంది. తాజాగా మత్స్యకారుల వలకు చిక్కిన రెండు పులస చేపలు వేలంలో రికార్డు ధర పలికాయి. యానాం రేవులో జరిగిన వేలంపాటలో ఈ రెండు చేపలను కలిపి ఓ మహిళ ఏకంగా రూ. 31,500కు కొనుగోలు చేశారు. వివరాల్లోకి వెళితే.. మత్స్యకారులకు 1.300 కేజీల బరువున్న రెండు పులస చేపలు చిక్కాయి. వీటికి నిర్వహించిన వేలంలో మత్స్యకార మహిళ పార్వతి పాల్గొన్నారు. ఒక చేపను రూ. 24,000కు, మరొకటి రూ. 7,500కు, మొత్తం రూ. 31,500కు ఆమె దక్కించుకున్నారు. ఈ ఏడాది మగ పులసకు ఇంత భారీ ధర పలకడం ఇదే తొలిసారని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం దొరికిన 1.250 కేజీల పులస రూ. 14,000



పలికింది. ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా పులసల లభ్యత గణనీయంగా తగ్గింది. ఎల్‌నినో ప్రభావంతో గోదావరికి వరదలు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణం. సాధారణంగా జులై, ఆగస్టు నెలల్లో గోదావరికి ఎర్ర నీరు వచ్చినప్పుడు పులసల రాక మొదలవుతుంది. కానీ, ఈసారి వరదలు ఆలస్యం కావడంతో చేపలు చాలా తక్కువగా వలకు చిక్కుతున్నాయి. దీంతో వీటికి డిమాండ్ పెరిగి, వేలంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సముద్రంలో ఉండే ఇలస చేప, గుడ్లు పెట్టేందుకు గోదావరి ప్రవాహానికి ఎదురీదుతుంది. ఈ క్రమంలోనే అది పులసగా మారుతుంది. దీని రుచి అద్భుతంగా ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పులస కోసం గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అరుదుగా దొరకడం, అమోఘమైన రుచి కారణంగానే దీనికి ఇంతటి డిమాండ్ ఏర్పడింది.

# నోటీసులకు 7 రోజుల్లో వివరణ ఇవ్వాలి

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీని అత్యంత నిక్కచ్చిగా, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.
బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. విచారణ జరిగే ప్రదేశం, తేదీ, సమయానికి సంబంధించిన వివరాలను కనీసం రెండు రోజుల ముందే ఓటరుకు తెలియజేయాలని నిర్దేశించారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలనే నిబంధనను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.
నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. అలాగే, మ్యాపింగ్ కానీ లేదా ఇతర సాంకేతిక లోపాలు ఉన్న కేసుల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయాలని సీఈవో సూచించారు. నోటీసులకు స్పందనగా సమర్పించాల్సిన పత్రాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు,
ఫిర్యాదుల స్థితిగతులపై ప్రతి వారం రాజకీయ పార్టీలకు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆరోగ్యానికి రూ.250 కోట్లు

అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని చెప్పారు. థింసా నృత్యంతో గిరిజన బిడ్డలు గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడం అభినందనీయమన్నారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ పెంచేందుకు సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.
లిడ్రోన్లతో అత్యవసర ఔషధాలు, వ్యాక్సీన్లు తరలింపులి ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను డ్రోన్ల ద్వారా పెద్ద ఆసుపత్రులకు తరలించి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని సీఎం తెలిపారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు సేవలందిస్తున్నామని, 104 వాహనాల ద్వారా సంచార వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, ఇది రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ గేమ్ చేంజర్‌గా మారుతుందని అన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం అల్లూరి జిల్లాలో 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉందని చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐదు సూత్రాలతో ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రహదారులు నిర్మించామని చెప్పారు. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు అందించడంతో పాటు సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెంచేందుకు అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగిందని, హోమ్‌స్టేల ద్వారా ఆతిథ్యం అందిస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుందని చెప్పారు. పరిశ్రమల్లో గిరిజన యువతకు ఉద్యోగాలు దక్కేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు.

**జీఓ నెంబర్ 3కు ప్రత్యామ్నాయం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్ 3ను తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందని సీఎం అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలో తీసుకొస్తామని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలన్న ఉద్దేశంతో ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఐఐటీ, నీట్ వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు. గిరిజన రైతులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్ కు తరలించేలా చేయూత అందించటమే ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌లో గిరిజన ప్రాంతాల ప్రజలు ముందున్నారని, పిల్లలే మన సంపద అనే సిద్ధాంతాన్ని వారు ఆచరిస్తుండటం గర్వకారణమన్నారు. 2014లో విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్ ఇప్పుడు ప్రపంచ స్థాయి వైద్య పరికరాలను తయారు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. కరోనా సమయంలో పెద్దఎత్తున వైద్య పరికరాలు అందించిందన్నారు. మెడ్‌టెక్ జోన్ ఉత్పత్తులు అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టు ద్వారా ప్రపంచానికి ఎగుమతి అవుతాయని చెప్పారు. సెప్టెంబరు 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. తొలి సంతకంతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.
లిబలవంతపు మత మార్పిడులకు కేరాఫ్ అడ్రస్ గొడ్డలి పార్టీలి
గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని చంద్రబాబు విమర్శించారు. జే బ్రాండ్లు, కల్తీ మద్యం ద్వారా కొన్ని వేల మందిని పొట్టన పెట్టుకుని ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని ఆరోపించారు. జే బ్రాండ్లను రద్దు చేసి మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని చెప్పారు. గతంలో గంజాయి ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ఇప్పుడు కాఫీ, మిరియాలు వంటి ప్రత్యామ్నాయ పంటలతో గిరిజనులకు ఆదాయ మార్గాలు చూపుతున్నామని తెలిపారు. గ్రూప్-1 పరీక్షల్లో గత పాలకులు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్షా పత్రాలను ఓ ఎలక్ట్రీషియన్, ఓ అటెండర్ చేత దిద్దించారని అన్నారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. గత పాలనలో దేవాలయాల ప్రతిష్ఠను దెబ్బతీశారని, బలవంతపు మత మార్పిడులు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ఓ మాజీ మంత్రి కోడలు బయటకు వచ్చి ఇంట్లో జరిగిన ఘటనలను వెల్లడించిందన్నారు. బలవంతంగా మత మార్పిడి చేయించే ప్రయత్నం చేశారని ఆమె చెప్పినట్లు తెలిపారు. బయట హిందువులుగా చెలామణి అవుతూ మతం మార్చే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మత విశ్వాసాలను ఎవరూ తప్పుపట్టరని, కానీ బలవంతంగా మత మార్పిడి చేయడం సరికాదన్నారు. గత పాలకుల ఐదేళ్లలో దేవాలయాలపై దాడులు జరిగాయని, వాటి పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. వారి పార్టీలో ఉండాలంటే మత మార్పిడి చేసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారని ఆరోపించారు. ఆ పార్టీతో చేతులు కలిపిన ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు జైలు పాలయ్యారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా పూటకో మాట ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు. గతంలో ఏకగ్రీవమని ఇప్పుడు ఎక్కడా కాకూడదనటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# గత ప్రభుత్వానికి నరకడం తప్ప... నాటే ఆలోచనే రాలేదు

ఈ సందర్భంగా శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ



"భూమాత మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి. మనం పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులను భూమాత నుంచే పొందుతున్నాం. మన తల్లిదండ్రులు మనకు పెట్టే ప్రతి ఆహారపు ముద్ద కూడా భూమాత ప్రసాదించినదే. అలాంటి భూమాతకు తిరిగి మనం ఏమి చేస్తున్నాం అని ప్రతి ఒక్కరు ఆలోచించాలి. అడవులను నరికి వేయడం, విచక్షణారహితంగా మైనింగ్ చేయడం, ప్రకృతిని కాలుష్యం చేయడం ద్వారా మనమే భూమాతను గాయపరుస్తున్నాం. భూమాతను కాపాడటం మన బాధ్యత మాత్రమే కాదు, మన కర్తవ్యం.
లిప్రకృతి పరిరక్షణకు... అశ్వత్థ నారాయణ వివాహంలి
భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన అశ్వత్థ నారాయణ వివాహం సంప్రదాయం ప్రకృతి, ఆధ్యాత్మికత, సామరస్యానికి ప్రతీక. రావి, వేప చెట్లను ఒకే గుంతలో నాటే ఈ సంప్రదాయంలో రావి చెట్టును విష్ణుమూర్తికి, వేప చెట్టును లక్ష్మీదేవికి ప్రతీకలుగా భావించడం మన సంస్కృతిలో ప్రకృతికి ఇచ్చిన విశిష్ట స్థానం. రావి, వేప చెట్లు కలిసి పెరగడం ద్వారా పచ్చని పరిసరాల ఏర్పాటుకు, స్వచ్ఛమైన వాతావరణానికి, జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుంది. ఈ చెట్లు దాదాపు 250 జీవరాశులకు ఆవాసంగా మారి, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**లిఆ ఆలోచనే మమ్మల్ని కలిపిందిలి**

ఏదైనా మంచి పని మొదలుపెట్టే ముందు మొక్క నాటడం నా అలవాటు. ప్రకృతిని ప్రేమించడంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, నాకూ ఒకే రకమైన ఆలోచనలు ఉన్నాయి. నిన్న ముఖ్యమంత్రి గారిని కలిసినప్పుడు పర్యావరణంపై ఆయనకున్న నిబద్ధత నాకు స్పష్టంగా తెలిసింది. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే మమ్మల్ని ఇలా ఒకే వేదికపైకి తెచ్చింది. గత ప్రభుత్వంలోని వారికి చెట్లను నరకడమే తప్ప, నాటాలనే ఆలోచనే వాళ్లకు రాలేదు. ఏ కార్యక్రమం చేసినా అడ్డువచ్చిన చెట్లను నరుక్కుంటూ పోయారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం కెన్యా వంటి దేశాలే అడవులకు, వన్యప్రాణులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయి. మరి జ్ఞానానికి పుట్టినిల్లు అయిన మన భారతదేశం, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**లిఅరణ్యారామం డిజైన్లు పరిశీలించిన శ్రీ నాగబాబు గారులి**

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ?24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను శ్రీ నాగబాబు గారు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ శ్రీ పి.వి. చలపతిరావు గారు శ్రీ నాగబాబు గారికి వివరించారు. అలాగే తాడేపల్లి పరిధిలోని అటవీ ప్రాంత వివరాలను తెలియజేశారు. ఈ భవన నిర్మాణ ప్రక్రియలో భాగంగా తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను వృథాగా నరికేయకుండా, వేరే చోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేశారు. ఈ విధంగా వేరే చోట నాటిన చెట్లను శ్రీ నాగబాబు గారు స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ శ్రీ ఎన్. నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు శ్రీ వై. శ్రీనివాసరెడ్డి, సీసీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏపీ గ్రీన్ శ్రీ బి.ఎన్.ఎన్. మూర్తి, డిఎఫ్ఓ గుంటూరు శ్రీమతి హిమశైలజ పాల్గొన్నారు.

# నెల్లూరు రైతులకు సాగునీరు అందించాలి!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని... రాయలసీమ, నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు వివరించారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండి, నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు.

## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ: కొల్లు రవీంద్ర

(మొదటి పేజీ తరువాయి)

రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న

(మొదటి పేజీ తరువాయి)

వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (జు=ూలు) తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంధనం, ఎరువుల సరఫరాపై ప్రభావం

ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు

# నిర్వహించుకోవాలి..

## సీఐ కిరణ్ కుమార్ రెడ్డి..



పాణ్యం ఆగస్టు 29 పల్లె వెలుగు : మండలంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని గణేష్ మండలి నిర్వాహకులు, యువకులతో సీఐ కిరణ్ కుమార్ రెడ్డి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు, మతపరమైన ఘర్షణలకు పాల్పడవద్దని అన్నారు. మండలంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా వినయక చవితి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, గణేష్ మండలి నిర్వాహకులు, నాయకులు, పోలీసు సిబ్బంది, యువకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీల్లో అతి కుర్రహ్మాన్ ఘన విజయం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాయలసీమ జోనల్ తైక్వాండో లో కరాటే మాబాషా గారి కుమారుడు అతి కుర్రహ్మాన్ గోల్డ్ మెడల్ సాధించారు. రామకృష్ణ డిగ్రీ ఆడిటోరియంలో జరిగిన రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిన అతి కుర్రహ్మాన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోల్డ్ మెడలను మాజీ ఎమ్మెల్యే శిల్ప రవి చక్రపాణి రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శిల్పా రవి చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ నీ కష్టం... నీ పట్టుదల... నీ ప్రతిభకు ఈ బంగారు పతకం నిదర్శనం అని తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని, ముందు మరెన్నో విజయాలు నీ సొంతం కావాలని అన్నారు. నీ విజయ పరంపర ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



## మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారి

# 355వ ఆరాధన మహోత్సవం

మంత్రాలయం పల్లె వెలుగు ఆగస్టు 29 మంత్రాలయం పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ రాఘవేంద్ర స్వామి వారి 355వ ఆరాధన మహోత్సవం సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు





వై. ప్రదీప్ రెడ్డి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రాలయం మఠంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, శ్రీ రాఘవేంద్ర స్వామి వారి బృందావనాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. అంతకుముందు మంత్రాలయం గ్రామదేవత శ్రీ మంచాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని, గ్రామ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు... శ్రీ రాఘవేంద్ర స్వామి వారి కృప, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# రాఖీ వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు



కర్నూల్ సిటీ తమ సోదరుల మణికట్టుకు పవిత్రమైన దారాన్ని కట్టి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆడపడుచులు కోరే పండుగే రాఖీ పండగా అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు తెలిపారు. రాఖీ పండగ సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులతోపాటు ఇతరులకు మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత రాఖీ కట్టి రాఖీ పండగ సంబరాలు జరిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం.

**● లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాల ప్రదానం.**

**● పురస్కారాలు అందుకున్న సాహితీవేత్త రమణమూర్తి, శారదా విద్యాపీఠం తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకటకృష్ణ.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. శనివారం తెలుగు వ్యావహారిక పితా మహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ క్లబ్ నాయకులు సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు సౌజన్యంతో స్థానిక శారదా విద్యాపీఠం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, రీజనల్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, సాహితీ వేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణమూర్తి, శారదా విద్యాపీఠం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకటకృష్ణ లకు లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కిరణ్ లాల్, వాసు కుట్టి, పాఠశాల కమిటీ సభ్యురాలు వసుంధర, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

---

# నంద్యాలలో తున్వాల్ ఈ-బైక్ నూతన షోరూమ్ ప్రారంభం...మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి.

**☛పర్యావరణ పరిరక్షణకు ఈ-బైక్స్ వినియోగం శ్రేయస్కరం: మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో వాహనదారులకు నాణ్యమైన, పర్యావరణహిత విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన 'తున్వాల్ ఈ-బైక్' షోరూమ్‌ను నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. నంద్యాల సాయిబాబా నగర్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో, సీపీఐ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం షోరూమ్‌లోని పలు మోడళ్ల ఈ-బైక్‌లను పరిశీలించి, వాటి పనితీరు మరియు ఫీచర్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ... పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి జీరో పొల్యూషన్ ఇచ్చే ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ బడ్జెట్‌లో, అత్యంత పొదుపైన ధరలకే ఈ బైక్‌లు లభిస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఈ షోరూమ్‌ను సందర్శించి, తమకు అనువైన ఈ-బైక్‌లను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అత్యాధునిక సదుపాయాలతో షోరూమ్‌ను ప్రారంభించిన నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేసి, వ్యాపారంలో సఫలీకృతులు కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, షోరూమ్ సిబ్బంది మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# రహదారులపై ఆక్రమణలు సరికాదు

**● ట్రాఫిక్ నియంత్రణకు, వాహనదారుల భద్రతకు సహకరించాలి ● కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించడం ఏమాత్రం సబబు కాదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. శనివారం బళ్లారి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారి సర్వీస్ రహదారిపై ఆక్రమణలను తొలగింపజేశారు. రహదారిపై ఉంచిన టైర్లు, శాశ్వత నిర్మాణాలను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆక్రమణదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వాహనదారులకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను వాణిజ్య దుకాణదారులు గ్రహించి, సామాజిక బాధ్యతగా ఆక్రమణలకు పాల్పడకుండా సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు రహదారులను ఆక్రమించకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎలాంటి రాజీ లేకుండా ఆక్రమణలను తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం విష్ణు టౌన్‌షిప్‌లో మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్ మార్పు పనులు జరుగుతున్న ప్రదేశాన్ని, పందిపాడులో నూతన డ్రెయిన్‌ను పరిశీలించారు. నందికొట్కూరు రోడ్డులోని డిమార్ట్ సమీపంలో పిజిఆర్ఎస్ ఫిర్యాదు ప్రాంతాన్ని, ముజఫర్ నగర్ నూతన రైతు బజార్‌ను పరిశీలించి, డస్ట్ బిన్‌లు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంజల్ ప్రణీత, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రవీంద్ర భారతి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**☛ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి సుబ్బారామి రెడ్డి**

**☛తెలుగు ఉపాధ్యాయులు వంశీకృష్ణ**





గడివేములపల్లె వెలుగు :శ్రీ రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, గడివేములలో లిఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవాన్నిలి పురస్కరించుకొని యాజమాన్యం వారు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పరిరక్షణ, ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లిముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి (వీజూ) సుబ్బారామిరెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు భాష యొక్క గొప్పతనం, ప్రాచీనత, సంస్కృతి, సాహిత్యంలో తెలుగు భాషకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. విద్యార్థులు మాతృభాషను గౌరవిస్తూ, తెలుగు భాష అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. లితెలుగు ఉపాధ్యాయులు చింతల వంశీకృష్ణ ఆధ్వర్యంలోలి నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు తెలుగు పద్యాలు, పాటలు, ప్రసంగాలు, వ్యాసరచన, తెలుగు భాషా గొప్పతనాన్ని తెలిపే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లిగిడుగు వెంకట రామమూర్తిలి గారి సేవలను స్మరించుకుంటూ ఆయన తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లిపాఠశాల యాజమాన్యం వారు సుబ్బారాయుడు, రాఘవేంద్ర, సీతారామ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంశీకృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులులి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలుగు భాషను ప్రేమిద్దాం, పరిరక్షిద్దాం, భావితరాలకు అందిద్దాం అనే సందేశంతో వేడుకలు ముగిశాయి.

# కూటమి పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నది: మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి .

**సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద భారీ ధర్నా విజయవంతం చేయండి... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి హెచ్చరించారు. సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద రైతులతో వైసీపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడుతున్నట్లు , ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నేతలు, వైసీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సి ఈ ఒ నెంబర్ పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతు సంఘం



నాయకులు అరికట్ల శివరామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వారి నుండి అభిప్రాయాలను, సూచనలను స్వీకరించి భవిష్యత్తు కార్యాచరణ పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, గిట్టుబాటు ధరలు లేక, సకాలంలో ఆదుకునే నాథుడు లేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పండించిన పంటకు సరైన ధరలు కల్పించడంలోనూ, సాగునీరు అందించడంలోనూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల హక్కులను కాపాడుకోవడానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అన్నదాతలకు అండగా నిలబడేందుకు రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని, క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. రైతుల పక్షాన వైఎస్ఆర్సిపి ఎల్లప్పుడూ పోరాడుతుందని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నంద్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో..

**● కర్నూలు అసెంబ్లీ యువతకు ఈఆర్వో, కమిషనర్ పిలుపు ● ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ దే' ● ఫారం-6, 7, 8 ద్వారా ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు అవకాశం**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో.. అనే పిలుపు మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ క్యాంపెయిన్ దే' కార్యక్రమాన్ని శనివారం ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్లో ఈఆర్వో, పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, వివరాల సవరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు



ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, అనర్హులైన లేదా మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లపై అభ్యంతరం లేదా తొలగింపు కోసం ఫారం-7, ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ డ్రాఫ్ట్‌లో ఓటు లేని వాళ్ళు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించే 'స్పెషల్ క్యాంపెయిన్ దే'లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హత ఉన్న యువతతో పాటు ఓటర్ల జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవాల్సిందిగా సూచించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

# జిమ్ చేయండి ఆరోగ్యంగా ఉండండిలి

**☛ లక్ష్మినగర్ పార్కులో నూతన ఓపెన్ జిమ్ ప్రారంభం**

హైదరాబాద్. ఆగస్ట్ 29 . (పల్లె వెలుగు ): హైదరాబాద్ (అత్తాపూర్) నగర ప్రజల ఆరోగ్యం శారీరక దృఢత్వమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్మీ నగర్ పార్క్ లో నూతనంగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ చేయండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అత్తాపూర్ వాకర్స్ అసోసియేషన్ మరియు యోగ సెంటర్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ సభ్యులు పంచకేశ్వరరావు విజయశ్రీ దంపతులు సాంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి జిమ్ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నగర్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు యోగ గురువు మహేందర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్నిపెంపొందించుకోవాలన్నారు సంపూర్ణ ఆరోగ్య కోసంయోగ జిమ్ మరియు నడక ధ్యానం అనేవి ముఖ్యమైన సాధనాలు అని ఆయన



పిలుపునిచ్చారు. పార్కుకు వచ్చే కాలనీవాసులు యువత మరియు సీనియర్ సిటిజన్లో ఓపెన్ న్యూస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హాజరైన వారిలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీ కలికి మూర్తి ఎం ప్రభాకర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరసింహారావు వెంకటపతి రాజు వెంకటరెడ్డి శ్రీ బాబురావు తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి నేదునూరి కనకయ్య అత్తాపూర్ యోగ సెంటర్ సభ్యులు లక్ష్మిచంద్రారెడ్డి శ్రీ సాయి విజయ్ చారి మనోహర్ రావు కుమార్ రెడ్డి విజయ రవి ప్రసాద్ మరియు ప్రమీల రేఖలు పాల్గొన్నారు. ఈ నూతనా ఓపెన్ జిమ్ ఏర్పాటు పట్ల లక్ష్మీ నగర్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జిహెచ్ఎంసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళా శాల క్రీడా పోటీలు




నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 29 . (పల్లె వెలుగు ): స్థానిక నెరవాడ సమీపంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల మధ్య క్రీడా పోటీలు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ చదరంగం మరియు బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారని గెలుపొందిన క్రీడా కారులకు ప్రశంసా పత్రము మరియు మెడల్స్ అందజేశారని తెలిపారు. విజేతలుగా నిలిచిన బాల బాలికలకు అధ్యాపక బృందం మరియు అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

# జ్జహళ్లిలో ఘనంగా ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు





హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 29 మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని కేరే అనుమప్ప దర్శనమిస్తున్న శ్రీ ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి లంకబిందెను భక్తులు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్దకు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య లంకబిందెను ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. శ్రావణ శనివారం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# మార్లమడికి కొండ గుహల్లో కొలువైన ఆంజనేయస్వామికి విశేష పూజలు

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 29 మండల పరిధిలోని మార్లమడికి గ్రామ సమీపంలోని





కొండ గుహల్లో వెలసిన శ్రీ ఆంజనేయస్వామివారికి శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసంలో శనివారం కావడంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కొండ గుహల వద్దకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆంజనేయస్వామి నామస్మరణతో కొండ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# కె.జి.బి.విలో ఘనంగా తెలుగు భాషా,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

దొర్నిపాడుఆగస్టు 29 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గలకస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంనందుశనివారంతెలుగు భాషా



దినోత్సవంగిడుగు రామ్మూర్తి పంతులు జయంతి జాతీయ క్రీడా దినోత్సవం' (హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి) వేడుకలనుఅత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రత్యేక అధికారిణి ఎస్ ఓ జయమణి ఉపాధ్యాయినులు హాజరై, గిడుగు రామ్మూర్తి పంతులు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళు లర్పించారు. ఈసందర్భంగవిద్యాధికారులుఉపాధ్యాయులుమాట్లాడుతూ,మాతృభాషఅయినతెలగునుకాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారన్నారు, వాడుక భాషా ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి చేసిన సేవలుచిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు పాఠశాలస్థాయినుంచేమాతృభాషపైపట్టుసాధించాలనిసూచించారు. అలాగేవిద్యార్థులకుచదువు తో పాటు శారీరక, మానసిక వికాసానికి క్రీడలుఎంతో అవసరమనిమేజర్ ధ్యాన్‌చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లోరాణించాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన ఉధృతం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మెడికల్, పారా మెడికల్ ఉద్యోగుల నిరసన శనివారంతో ఆరో రోజుకు చేరింది. నంద్యాల పట్టణంలోని



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టి తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు 100 శాతం గ్రాస్ వేతనం, ఈపీఎఫ్, హెల్త్ కార్డులు, బదిలీలకు అవకాశం కల్పించాలని వారు కోరారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 8న విధుల బహిష్కరణకు దిగుతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# పెరటి తోటలపెంపకం పై అంగన్వాడి సిబ్బందికి



దొర్నిపాడుఆగస్టు 29 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు అంగన్వాడి కేంద్రం నందు శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ వారి సహకారంతో అంగన్వాడి సిబ్బందికి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారులు లక్ష్మీ ప్రియ మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆరోగ్యం అవసరం అన్నారు ,సముతుల్య ఆహారం ఆరోగ్య పోషణ విలువలు మిల్లెట్స్ ప్రాముఖ్యత గురించి ఆకుకూరలు ,కూరగాయల గురించి వివరించారు అంగన్వాడి కేంద్రాల యందు స్థలాలు ఉన్న వారు ఆకుకూరలు కూరగాయలు వేయాలన్నారు సంబంధించిన విత్తనాలు కూడా కృషి విజ్ఞాన కేంద్రం వారు అందిస్తారని వారు తెలిపారు

# శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ దేవాలయ అన్నదానమునకు లక్ష 116 రూపాయలు విరాళం



పల్లె వెలుగు బేతంచెర్ల ప్రతినిధి (ఆగస్టు 29) నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయమునకు శనివారం నాడు నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కోట్కూరు గ్రామానికి చెందిన ఎం. చిన్నయ్య నిత్య అన్నదానమునకు లక్ష 116 రూపాయలు విరాళంగా అందించారని ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

# పాపం గణేష్ కు

## బ్యాటరీ సైకిల్ మంజూరు సాధ్యం కాదట



**చదువుకు సైకిల్ కష్టాలు**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 29: చదువు కోసం కళాశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థి గణేష్ కు మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామానికి చెందిన గణేష్ బాల్యం నుండి శారీరక ఎదుగుదల లేకపోవడంతో అష్ట కష్టాలు పడ్డాడు. ఎలాగోలా పదవ తరగతి పాసై, బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ లో చేరాడు. అయితే లింగాపురం గ్రామం నుండి కళాశాలకు వచ్చేందుకు గణేష్ ఇబ్బందులు పడుతూ ఉన్నాడు. ఇం దుకు శరీరం సహకరించకపోవడంతో, తోటి విద్యార్థులే గణేష్ ను కళాశాలకు తీసుకొని వస్తున్నారు. ఈనెల 8వ తేదీన పార్నపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తనకు మూడు చక్రాల సైకిల్ ను మంజూరు చేయించాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఈ దరఖాస్తును విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కర్నూలుకు అధికారులు సిఫారసు చేశారు. గణేష్ ఫిర్యాదును పరిశీలించిన అధికారులు మూడు చక్రాల బ్యాటిల్ సైకిల్ కొరకు ఆ లింకు వారు నిర్వహించే క్యాంపుకు దరఖాస్తుదారుడు హాజరుకావాలని పేర్కొన్నారు. క్యాంపులో డాక్టర్లు పరీక్షించి తగిన సహాయ పరికరం కొరకు ఎంపిక చేస్తారు కాబట్టి, ఆ లింకో క్యాంపు నిర్వహించే ముందు పత్రికా ప్రకటన ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనంతరం క్యాంపుకు హాజరైతే నియమ నిబంధనల మేరకు మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తామని గణేష్ కు సమాచారం అందించారు. అయితే ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వయసు 18 నుండి 45 సంవత్సరాల వయసు ఉన్న వారికి బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తామని, గణేష్ కు ప్రస్తుతం వయస్సు 16 సంవత్సరాలు ఉన్నందున మూడు చక్రాల సైకిల్ మంజూరు చేయుటకు వీలుపడదని చెప్పారు. సైకిల్ వస్తుందన్న ఆశపడిన గణేష్ కు నిరాశే మిగిలింది. మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ మంజూరుకు గణేష్ మరో రెండేళ్లపాటు ఆగాల్సిందే!

# 37వ వార్డులో ఉత్సాహంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

**కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను గడపగడపకూ చేరవేస్తున్న నాయకులు**

**ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ధ్యేయం: చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న కూటమి ప్రభుత్వ అభివృద్ధి పథకాలను, విజయాలను గడపగడపకూ వివరించేందుకు చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం స్థానిక 37వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీలో శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ప్రతి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేద మరియు మధ్యతరగతి వర్గాల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను కరపత్రాల ద్వారా క్షుణ్ణంగా వివరించారు.

**ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం:**

ఈ సందర్భంగా కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. స్థానికుల నుంచి అందుతున్న విశేష స్పందనతో 'ఇంటింటికీ తెలుగుదేశం' విజయవంతంగా ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తం చేశారు.

భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు:

ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మరియు క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు బాలకృష్ణ, సుబ్బరాయుడు, వెంకటేష్, రసూల్, అనిల్, మధులతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, మహిళలు, యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియా షార్ట్ / బ్రీఫ్ న్యూస్ (సింగిల్ కాలమ్ లేదా సోషల్ మీడియా కోసం):

బీడీ వర్కర్స్ కాలనీలో ఘనంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 37వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం జోరుగా సాగింది. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ స్థానిక నాయకులతో కలిసి ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, కాసాని మహేష్ గౌడ్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి.

**శ్రీశైలంలో నీరు నిల్వలు ఉన్నాయని చెబుతున్నారు... దిగువకు నీరు వదలరా? ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి..**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. వార్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటలు సాగు చేసేందుకు, ప్రజలకు, పశువులకు త్రాగునీరు లేక విలవిల లాడిపోతున్న పరిస్థితిలో... అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, అయితే దిగువకు నీటిని ఎందుకు వదలడంలేదో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామానికి చెందిన నీటి కుంటలో చుక్కనీరులేక ఎండిపోయిన దుస్థితిని చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే నంద్యాల పట్టణ శివారులోని చిన్నచెరువుకూడా ఎండి పోవడాన్ని నేడు పరిశీలించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డిమాట్లాడుతూ... గత 24 సంవత్సరాల తర్వాత నంద్యాల మండలం మిట్నాల గ్రామ కుంట ఎండిపోయిందని పేర్కొన్నారు. దుర్భిక్షపరిస్థితిలో ఉన్న రైతులకు, ప్రజలకు, పశు వులకు కనీసం నీరు అందించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీరు నిల్వ ఉందని త్రాగునీటిని విడుదల చేస్తామని ప్రజలకు ఒట్టి మాటలు చెబుతూ కాలం గడిపేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం తెలంగాణా రాష్ట్రంలో నాయకులు చూపిస్తున్న చొరవ నేడు కూటమి నేతలు చూపించడం లేదని ఎంతో దారుణంగా ఉందని విమర్శించారు. నీటి వాటాల్లో రెండు తెలుగురాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. అయితే మన ఏపీకి మాత్రం నీటిని ఎందుకు విడుదల చేయడంలోదో ప్రభుత్వం చెప్పాలన్నారు. వీటికి అంతటికి కారణం తెలంగాణ సీఎంతో ఏపీ సీఎం చేసుకున్న చీకటి ఇప్పందం అని తేటతెల్లం అయ్యిందన్నారు. జిల్లా కలెక్టర్ మాత్రం సాగునీరు ఉందని, త్రాగునీరు ఉందని చెబుతున్నారని, అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనడానికి మిట్నాల కుంట సాక్షం అన్నారు. ఇటీవల ప్రధాన మంత్రి మన్కీ బాత్లో నంద్యాలకు త్రాగు నీరు, సాగునీరు ఇస్తున్నామని పొగిడారని ఇది నిజంగా ఉందో లేదో అధికారులు చెప్పాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి 10 కిలో మీటర్ ల దూరంలో ఉన్న మిట్నాల గ్రామానికి నీరు లేదన్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసింది మాత్రం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరు చెబుతున్నారని తెలిపారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు తిరుపతి రెడ్డి,రైతులు, వైసీపీ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతపరచాలి.

## నిరాశ్రయులకు హోమ్ లెస్ సెంటర్లు, పోలీస్ సిబ్బందికి రెగ్యులర్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి : జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ .

**● విజయవంతమైన రెడ్ క్రాస్ సర్వసభ్య సమావేశం (ఏజీఎం). ● రెడ్ క్రాస్ సంస్థలో సేవలందించిన వారిని అభినందించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు మెరుగైన మానవతా సేవలు అందించే దిశగా ముమ్మరంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా తెలిపారు. శనివారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రెడీ క్రాస్ సొసైటీ వారి వార్షిక సర్వ సభ్య సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జిల్లా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ ఐపీఎస్

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన జిల్లా గా ఏర్పడిన సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీకి సొంత భవనం, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ వంటి మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి నుంచి ప్రస్తుతం అనేక సేవలను అందించే స్థాయికి తీసుకురావడం జరిగిందన్నారు.

వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పాత జపాన్ ప్రాజెక్టు భవనాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయించి, అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టి సొంత భవనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా ఫ్రీజర్లు, ఏసీలు, ల్యాబ్ టెక్నీషియన్ తదితర సదుపాయాలతో బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానంపై యువత, మహిళల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్‌క్రాస్ భవనానికి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు ఎన్ ఈ డి సి ఏ పి మార్గదర్శకత్వంలో పూర్తి స్థాయి సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు . ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందుబాటులో ఉండేలా జి జి హెచ్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. డోన్, శ్రీశైలం ప్రాంతాలతో పాటు ఎన్ హెచ్-40, ఎన్ హెచ్-340సి జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ కొత్తగా బ్లడ్ స్టోరేజ్ యూనిట్లు, జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవయవదాన ప్రాముఖ్యతపై విస్తృత అవగాహనకల్పించాలన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో కుటుంబాలకు అవయవదానం ద్వారా లభించిన ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ బీమా పథకం ద్వారా సుమారు రూ.1 కోటి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అన్నారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లోని నిరాశ్రయులు, యాచకులకు ఆశ్రయం కల్పించేందుకు ఎం ఈ పి ఎం ఎ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నైట్ షెల్టర్లను రెడ్‌క్రాస్ పర్యవేక్షణలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు సభ్యత్వాలను పెంచాలని, జిల్లాలోని పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు రెడ్‌క్రాస్‌తో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాలను కాపాడే రక్తదానం, అవయవదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సిపిఆర్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, వైద్య శిబిరాలు, ఆరోగ్య సేవలు వంటి కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ మరింత చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. సమాజంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మానవతా సేవా కార్యక్రమాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తుందని తెలిపారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, విపత్తుల సమయంలో బాధితులకు సహాయక చర్యలు అందించడం అత్యవసర సమయాల్లో ప్రజలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సంస్థ చేరువుగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీకి జిల్లా కలెక్టర్ నిరంతరం ఆర్థికంగా, పరిపాలనాపరంగా అన్ని విధాలా మద్దతు, సహకారం అందిస్తున్నారని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా యంత్రాంగం సహకారంతో నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా జన్ ఔషధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయనీ ఇటువంటి ప్రజా ఉపకార కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రి వేళల్లో ఆశ్రయం లేకుండా ఉంటున్న వృద్ధులు, నిరాశ్రయుల కోసం ప్రత్యేకంగా హోమ్‌లెస్ సెంటర్ (ఆశ్రయ కేంద్రం) ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవడంతో పాటు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు సిబ్బందికి రెగ్యులర్ మెడికల్ క్యాంపులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ, అనేక సందర్భాల్లో సరైన సమయానికి ఆహారం తీసుకోలేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు . రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా వారి విధి నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందన్నారు.










రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ అందించిన విలువైన సలహాలు, సూచనలను తప్పకుండా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. “తక్కువ ప్రసంగాలు -- ఎక్కువ సేవా కార్యక్రమాలు” అనే లక్ష్యంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సభ్యులు, వాలంటీర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ అరుణ కుమారి 2024 25 సంవత్సరాలలో 2025 26 సంవత్సరాలలో రెడ్క్రాస్కు అందిన నిధులు వాటికి పెట్టిన ఖర్చుల వివరాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి అన్నిటిని సభ్యులకు, అతిధులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మారుతి కుమార్, ఉస్మాన్ భాష, డాక్టర్ నిషిత రెడ్డి, యాకూబ్, సురేంద్ర, నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాల్లో రక్తదాన శిబిరాల్లో ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ తదితర అవగాహన సదస్సులో పాల్గొని విశేష సేవలు అందించిన పలువురికి జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం.

**● లయన్స్ క్లబ్ క్రీడా దినోత్సవ పురస్కారాలు అందుకున్న చెస్ కోచ్ రామ సుబ్బారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు. ● క్రీడలను స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు ప్రోత్సహించాలి: డాక్టర్ రవి కృష్ణ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. శనివారం హాకీ మాంత్రికుడు పద్మభూషణ్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవం పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు కన్నయ్య సౌజన్యంతో క్రీడలను ప్రోత్సహిస్తున్న ఇద్దరు కోచ్ లకు నంద్యాల లయన్స్ క్లబ్ జాతీయ క్రీడా దినోత్సవ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. చెస్ కోచ్ గా,నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శిగా ఎంతోమంది చెస్ క్రీడాకారులను తయారుచేసిన రామ సుబ్బారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గా క్రీడలను ప్రోత్సహించడంలో విశిష్ట కృషి చేసిన



శ్రీనివాసులు లకు అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్,ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, దాతలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు యువత క్రీడలలో పాల్గొనవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలు గెలుపోటములను స్వీకరించే మనస్తత్వం,ఓటమి చెందిన వారు తిరిగి విజయం కోసం ప్రయత్నించే స్వభావం, క్రమశిక్షణ, ఏకాగ్రత అలవాడతాయని అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ యూత్ బ్యాచ్ సభ్యులు వచ్చే నెలలో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ కు బహుమతుల కోసం 10 వేల రూపాయలు విరాళంగా ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్,మేడా చంద్రశేఖర్,జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సంయుక్త కార్యదర్శి అమిదేల జనార్ధన్,కార్యక్రమానికి సహకరించిన కన్నయ్య, సీనియర్ సభ్యులు ఎం.పీ.వి.రమణయ్య, తోట శ్రీనివాస్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది నందిపల్లి నారాయణకు ఏపీ హైకోర్టు మధ్య వర్తిత్వ సర్టిఫికెట్ ప్రధానం

పల్లె వెలుగు బేతంచర్ల ప్రతినిధి (ఆగస్టు 29):--- 2025 సంవత్సరంలో ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ (వీవంఱుఅశీఅ) శిక్షణ పూర్తి చేసుకున్న డోన్ ప్రముఖ సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణకు శనివారం కర్నూలు జిల్లా కోర్టులో సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీ కబర్ది, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీమతి లీలా వెంకట శేషాద్రి గార్లు సర్టిఫికేట్లను అందజేశారు. కర్నూలు ఉమ్మడి జిల్లాకు చెందిన 2025 బ్యాచ్ కు చెందిన 27 మంది మీడియేటర్ న్యాయవాదులకు ఈ సందర్భంగా సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది నందిపల్లె నారాయణ మాట్లాడుతూ, ఇప్పటివరకు డోన్ కోర్టు కాంప్లెక్స్ పరిధిలో 18 కేసులను ఇరువర్గాల కక్షిదారులు మరియు న్యాయవాదుల సమక్షంలో మధ్యవర్తిత్వం ద్వారా ఉచితంగా పరిష్కరించినట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా అన్ని రకాల కేసులను కేవలం 3 నెలల్లోనే ఇరువర్గాల అంగీకారంతో స్నేహపూర్వకంగా, ఉచితంగా పరిష్కరించుకోవచ్చని, ఇలా పరిష్కరించుకున్న కేసులకు అప్పీలుకు అవకాశం ఉండదని ఆయన తెలిపారు. కేసుల వివరాల కోసం సంబంధిత కోర్టులో తమ న్యాయవాదిని లేదా జడ్జిని, లేదా కర్నూలు జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఋూూూ) కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.



# మిలిటరీ కాలనీలో ప్రజా మరుగుదొడ్లను తొలగించొద్దు

**ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని అధికారులకు గ్రామస్తుల విజ్ఞప్తి**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు పరిధిలోని మిలిటరీ కాలనీలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను తొలగించవద్దని గ్రామ ప్రజలు నందనపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

?గత కొన్నేళ్లుగా

మహిళల అవసరాల కోసం వినియోగిస్తున్న ఈ మరుగుదొడ్లను కొందరు వ్యక్తులు తొలగించాలని చూడటంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో అధికారులు,

ఇంజినీర్లు సర్వే చేసి ఎలాంటి ఆవాసాలు లేని ప్రభుత్వ స్థలంలో ప్రజల సౌకర్యార్థం వీటిని నిర్మించారని గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఆ ప్రాంతంలో ఇళ్లు, కొట్టాలు నిర్మించుకున్న కొందరు వ్యక్తులు.. దుర్వాసన వస్తోందనే నెపంతో ప్రజా ఆస్తులను తొలగించాలని కోరడం సమంజసం కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



?వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజా ఆస్తులను ధ్వంసం చేయకుండా, ముఖ్యంగా మాజీ సైనికులకు కేటాయించిన స్థలాల్లో అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మరుగుదొడ్లను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

?ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస నాయక్, వీఏవో వెంకటేశ్వర్లు, గ్రామస్థులు డి. సుబ్బన్న, వై. కరుణమ్మ, డి. జయమ్మ, వై. నాగరత్నమ్మ, ఎస్. నాగన్న, ఆర్. విజయుడు, నారాయణమ్మ, లక్ష్మీదేవి, నాగమణి, అంజనమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగోడులో ‘డోర్ టు డోర్’ కార్యక్రమం.

వెలుగోడు, 29 శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు,



తెలుగుదేశం పార్టీ పిలుపుతో వెలుగోడు పట్టణంలో శనివారం ‘డోర్ టు డోర్’ ప్రజా సమస్యల సేకరణ కార్యక్రమం జరిగింది.స్థానిక గంగాబాయి వీధిలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఖలీల్ ఖాన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.అదేవిధంగా ఆయా కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను నమోదు చేసుకున్నారు, వాటిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేందుకు నాయకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండ్ల శంకర్ రెడ్డి , బూత్ కన్వీనర్ గిరిబాబు, టిడిపి నాయకులు రాము తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బేతంచెర్లలో జాతీయ క్రీడా దినోత్సవం
## - విద్యార్థులకు లయన్స్ క్లబ్ బహుమతుల ప్రదానం


బేతంచెర్ల, ఆగస్టు 29: బేతంచెర్ల పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) నందు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలు



నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బేతంచెర్ల ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూరా మధు సుధాకర్ రెడ్డి, ట్రెజరర్ కమతం మనోహర్ రెడ్డి సహకారంతో ఈ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూరా మధు సుధాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పాపారాయుడు, జోన్ చైర్మన్ ఉపేంద్ర, లయన్స్ క్లబ్ సభ్యులు వలిభాష, రాజేష్, బోడె రమేష్, శ్రీకాంత్, వన్నూరు సాహెబ్, కమల్ బాష, ఉపాధ్యాయులు దానమయ్య, ఆర్.వి. రమణ, బలమద్దిరాజు, కృష్ణ, శ్రీవాణి, లక్ష్మీదేవమ్మ, రోజమ్మ, కామాక్షమ్మ, సునందమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నంగునూర్‌లో పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు

నంగునూర్, ఆగస్టు 29, సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ




జన్మదిన వేడుకలు నంగునూర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. నంగునూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చారు. పూజల హరికృష్ణకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పూజల హరికృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల కోసం మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాపోల్ రాజహుదూర్ రెడ్డి, ఎండీ. ఇమ్రాన్, కర్ణకంటి. రవీంద్ర చారి, సర్పంచులు రాధాకృష్ణ, మైపాల్ రెడ్డి, రంగు. అశోక్, రంగారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ నాయక్, ప్రభాకర్, సామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కాటన్ కనకయ్య, చిన్న అజ్మత్,వెంకటేష్, రమేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడలు, తెలుగు భాషపై విద్యార్థుల అవగాహన

బేతంచెర్ల, ఆగస్టు 29: బేతంచెర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ (మెయిన్) నందు శుక్రవారం




హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ మరియు తెలుగు భాషా వేత్త గిడుగు వెంకట రామమూర్తి గార్ల జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో, ఎంఈఓ-2 గారి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మేజర్ ధ్యాన్ చంద్ సేవలను, తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రసంగించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, కళారూపాలను ప్రదర్శించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ గారి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు:చైర్మన్



మహానంది, పల్లె వెలుగు గోశాల గోవులను సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం మహానంది దేవస్థానంలోని గోశాలను పరిశీలించారు. గోవుల పరిసరాల్లో శుభ్రత, రాత్రి



వేళల్లో దోమల బారిన గురి కాకుండా చర్యలు,దాన, పచ్చి గడ్డి, ఆరోగ్య పరిస్థితిపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోవులకు ఎలాంటి లోటు రాకుండా పూర్తి స్థాయిలో సంరక్షణ కల్పించాలని సిబ్బందికి సూచించారు.

# రండి మన దళితులపైన సమస్యల కోసం పోరాడుదాం

**● ఎన్నో గ్రామాలు మన దళితుల భూములను అక్రమించుకున్న వారిపైన పోరాడుదాం, ● దళితులు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇస్తే దళితులపైనే తప్పుదోవ పట్టిస్తున్న పోలీస్ శాఖ, ● దళితుల భూములను ఆక్రమించుకొని దళితులపై దాడులు చేస్తున్నారు, , ● పట్టించుకోని పోలీస్ శాఖ వారు,,**

నందవరం పల్లె వెలుగు ఆగస్టు 29 ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలం
ముగతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, నూతన కమిటీ ఏర్పాటు
సామాజిక ఉద్యమాల పితామహుడు సామాజిక పరివర్తకుడు ఎమ్మార్పీఎస్ సంస్థాపక వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఇన్చార్జి దుమ్ము చిన్న వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు నందవరం మండలం ముగతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మరియు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు ముఖ్య అతిథులుగా పాల్గొన్న నందవరం మండల అధ్యక్షుడు పెద్దయ్య ఎమ్మిగనూరు మండల అధ్యక్షుడు ఎం సి గిడ్డయ్య మాదిగ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుమాట్లాడుతూ రాబోయే కాలంలో సమాజాభివృద్ధి కోసం మాదిగల సంఘటితం కోసం మాదిగ విద్యార్థుల భవిష్యత్తు కోసం మహిళల సామాజిక అవసరాల ఉద్యమాల కోసం ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మన వారి కాన్షీరామ్ ఆశయాల మేరకు భవిష్యత్తు పోరాటాలలో మాదిగలు దళితులు సిద్ధంగా



సామాజిక ప్రజా సమస్యల పోరాటానికై గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నాయకులు సిద్ధంగా ఉండాలని పోరాడితే పోయేదేమీ లేదని హక్కుల కోసం బిక్షం ఎత్తుకోవడం కాదని పోరాటాల ద్వారా సాధించుకోవాలన్న బాబు జగ్జీవన్ రామ్ నినాదం మేరకు సమస్యలు పోరాటానికై రాజ్యాంగబద్ధంగా పోరాడాలని పిలుపునిచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం మేరకు సమాజ పరివర్తనకు విద్య ఉపాధి మాత్రమే ఏకైక దిక్కు అని గలమెత్తిన మహాత్మ పూలే ఆశలమేరకు రాజ్యాంగం లో రాజకీయ ప్రాధాన్య రాజకీయ అధికారమే ఏకైక అవకాశం అనే గల మెత్తి పోరాడి నిరూపించిన ఉండాలని పిలుపునిచ్చారు . ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా దేవపాల్
ఎన్నుకున్నారు గ్రామ అధ్యక్షునిగా నరసన్న ఉపాధ్యక్షులుగా భీమన్న
ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ కన్వీనర్ కోకన్వీనర్ శివన్న, ఎం నరేష్ మరియు హలహరి రాజేష్ మరియు దేవపాలు మరియు చిన్న నరసన్న, హనుమంతు ఆనందు డీలర్, ప్రభుదాసు, గంజిల్లా సామేలు, జై రాజు, రాజు, చిన్న, సందీపు, అశోకు, రోజన్న, సోమన్న, దేవదాసు గ్రామములో కుల పెద్దలు స్థానిక సిఎస్ఐ సంఘ సభ్యులు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# నీట్ పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

**☛అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశం**

**☛జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో 2,114 మంది హాజరు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నిర్వహించనున్న నీట్ పీజీ--2026 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. శనివారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.
జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 కేంద్రాల్లో (కర్నూలు-5, ఆదోని-1, ఎమ్మిగనూరు-1) 2,114 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ కోసం కర్నూలు



ఆర్డీవో, కర్నూలు మున్సిపల్ కమిషనర్, డ్వామా పీడీ, ఎమ్మిగనూరు కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు.
పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరగనున్నందున నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీకి ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద ఉదయం 5 గంటల నుంచే కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించరాదని, క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అభ్యర్థులను లోపలికి పంపాలని ఆదేశించారు.
అత్యవసర సేవల నిమిత్తం కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్‌లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డ్వామా పీడీ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బీఎస్పీ నూతన అధ్యక్షునిగా
# మలిగే రామలింగయ్య నియామకం

**● రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ కు**

**● కర్నూలు జిల్లా నూతన అధ్యక్షులు మలిగే రామలింగయ్య శాలవాతో సన్మానం**

**● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జె మల్లికల్ కి, ● రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ**




ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 29 అనంతపురం జిల్లా హైదరాబాద్ చెఫ్ హోటల్లో కర్నూలు జిల్లా బీఎస్పీ నూతన అధ్యక్షునిగా మలిగే రామలింగయ్య ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ను శనివారం మలిగే రామలింగయ్య మర్యాదపూర్వకంగా కలిసి



శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ నీపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా నియమిస్తున్నాము. మీరు జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరింప చేయాలని అలాగే రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఎస్పీ నాయకులు పోటీలో నిలిచి గెలుపు దిశగా ప్రయాణించాలని ఆయన సూచించారు. కర్నూలు జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మలిగే రామలింగయ్య మాట్లాడుతూ మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, నారాయణ గురు, సాహు మహారాజ్, పెరియర్ రామస్వామి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మాన్యవర్ కాన్సీరాం ఆశయాలతో నిర్మాణమైన బహుజన సమాజ్ పార్టీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ జె మల్లికల్ , రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ నాపై నమ్మకం ఉంచి కర్నూలు జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ నమ్మకంతో కచ్చితంగా రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా ఇదివరకే ఉన్న జిల్లా అధ్యక్షులు గుదిపి సామేలు మరియు ఇతర జిల్లా కమిటీ సభ్యులు,అసెంబ్లీ,మండల కమిటీ సభ్యుల సహకారం తీసుకొని అభ్యర్థులను సిద్ధం చేస్తానని అలాగే అభ్యర్థులను ప్రతి సర్పంచి ,ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో నిలబెట్టే బాధ్యత తీసుకొని తప్పకుండా కొన్ని సీట్లైనా గెలిపించే దిశగా ప్రయత్నం చేస్తానని తెలియజేస్తున్నాను . త్వరలో నూతన జిల్లా కమిటీ, నియోజవర్గ కమిటీలు, మండల కమిటీలు, బూతు కమిటీలు నియమిస్తామని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో కర్నూల్ జిల్లా ఇంచార్జ్ అరుణ్ కుమార్ ఇతర జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రపతి అవార్డు గ్రహీత పంపన శ్రీనివాస్‌కు కైకవోలులో ఘన సన్మానం

**☛ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటుడు కృష్ణ భగవాన్**



కైకవోలు/పెదపూడి,ఆగస్ట్ 29పల్లె వెలుగు,ప్రతినిధి పల్లపాటి శిరీష్ కుమార్ : కాకినాడ జిల్లా పెదపూడి మండలం కైకవోలు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక రాష్ట్రపతి అవార్డు గ్రహీత పంపన శ్రీనివాస్‌కు శనివారం ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయు లు, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ప్రముఖ సినీ నటుడు కృష్ణ భగవాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి దేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడం కైకవోలు ప్రాంతానికే ఎంతో గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకుని, లక్ష్యంతో కూడిన నిరంతర కృషితో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, సర్పంచ్ పట్టాభిరామన్న చౌదరి, పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, ఇన్చార్జి హెచ్ఎం సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు దాట్ల చరణ్ రాజు, గోలి సుభాష్, ఉపాధ్యాయులు డి.వి.ఎస్.ఎన్. రాజు,



సూరిబాబు, జి.వి. పద్మావతి, గోవిందరాజులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాట్రేనికోన ప్రధాన రోడ్డు మలుపులో ప్రమాద స్థాయిలో డ్రైనేజీ !పొంచి ఉన్న ప్రమాదం!

కాట్రేనికోన, ఆగస్టు 29 పల్లె వెలుగు, మండల కేంద్రమైన కాట్రేనికోన లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా స్థానిక పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలోని ప్రధాన రోడ్డు మలుపు వద్ద డ్రైనేజీపై సిమెంట్ బల్లలు (స్లాబ్ కవర్లు) లేకపోవడంతో ఆ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. తెరిచి ఉన్న ఈ డ్రైనేజీకి సమీపంలోనే ప్రాథమిక పాఠశాల (ఎలిమెంటరీ స్కూల్) ఉంది. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే చిన్నపిల్లలు ఈ ప్రమాదకరమైన డ్రైనేజీ పక్కనుంచే అడుగులు వేయాల్సి వస్తోంది. ఏమాత్రం కాలుజారినా చిన్నారులు మురుగు కాలువలో పడిపోయే ప్రమాదం పొంచి ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మలుపు వద్ద ప్రధాన రహదారి వెంబడి కనీస రోడ్డు బెర్మ (బర్మ్/రోడ్డు మార్జిన్)




కూడా లేదు. దీంతో ఎదురుగావాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకునే అవకాశం లేక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి డ్రైనేజీలో పడి గాయపడిన ఘటనలు ఇప్పటికే చోటుచేసుకున్నాయి. రాత్రి వేళల్లో ఈ మలుపు మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ పైకప్పు లేకపోవడంతో మురుగు నీరు బహిరంగంగా ఉండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది పరిసర ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే ముప్పు ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఆంజనేయ స్వామి విగ్రహం మలుపు వద్ద ఉన్న డ్రైనేజీపై పటిష్టమైన సిమెంట్ బల్లలు వేయించాలని, రోడ్డు మార్జిన్లను సరిచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేములలోని







శ్రీ రాజ రాజేశ్వరి హై స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవం మరియు వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ. రామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరిం మేజర్ ధ్యాన్చంద్ గారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ...

తెలుగు భాష తియ్యని భాష అని, దీనిని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని పిలుస్తారని, మన సంస్కృతి, సంప్రదాయాలకు తెలుగు భాష పట్టుకొమ్మ అని, ప్రతి విద్యార్థి తెలుగులో రాయడం, చదవడం గర్వంగా భావించాలని అన్నారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత మరియు ఈరోజు క్రీడా దినోత్సవం గురించి ఆటలాడటం వల్ల మన మనసు శారీరకంగా,మానసికంగా చాలా ఆరోగ్యంగా ఉంటారు క్రీడల్లో భాగంగా యోగాభ్యాసం, వ్యాయామము తప్పనిసరిగా చేయవలెను అని తెలిపారు. అనంతరం తెలుగు భాష దినోత్సవం మరియు క్రీడా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీ,కబడ్డీ, క్రికెట్, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. చదువుతో పాటు క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని8 సూచించారు.. తరువాత ఉపాధ్యాయ ఉపాధ్యాయులు మరి మరియు విద్యార్థిని విద్యార్థులు తెలుగు భాష దినోత్సవం గురించి మరియు క్రీడా దినోత్సవము గురించి ప్రసంగించారు. తెలుగు భాష ఉపాధ్యాయులు మరియు క్రీడా ఉపాధ్యాయులకు ఘనంగా ప్రధానోపాధ్యాయులు

రామేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# హోలీ మేరీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**☛621 మందిలో 445 మంది ఉత్తీర్ణులు.. 91 మందికి డిస్టింక్షన్**

**☛కళాశాల టాపర్‌గా అనెమోని అఖిల**




కీసర పల్లె వెలుగు, ఆగస్టు 29 : విద్యార్థులు డిగ్రీతో పాటు జ్ఞానం, నైపుణ్యాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ (రిటైర్డ్) సూచించారు. హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే--2026 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సెంచూరియన్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.ఎం. రావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వృత్తి జీవితంలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జె.ఎం. రావు మాట్లాడుతూ.. విద్యార్థులు తాము సంపాదించిన జ్ఞానాన్ని వాస్తవ జీవిత సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు సృజనాత్మకత, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

**74 శాతం ఉత్తీర్ణత**

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ వార్షిక నివేదికను సమర్పించారు. 1994--95లో కేవలం 30 మంది విద్యార్థులతో ఎంసీఏ కోర్సుతో ప్రారంభమైన హోలీ మేరీ విద్యా ప్రస్థానం నేడు యూజీసీ అటానమస్ హోదా కలిగిన విద్యాసంస్థగా ఎదిగిందని తెలిపారు. 2025--26 విద్యా సంవత్సరంలో సంస్థ 74 శాతం ఉత్తీర్ణత సాధించిందని, గేట్, క్యాట్, జీఆర్ఈ పరీక్షల్లో 100 మంది విద్యార్థులు అర్హత సాధించారని వెల్లడించారు. గ్రాడ్యుయేషన్ డేలో భాగంగా మొత్తం 621 మంది విద్యార్థుల్లో 445 మంది తమ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. వీరిలో 91 మంది ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్, 297 మంది ఫస్ట్ క్లాస్, 57 మంది సెకండ్ క్లాస్ సాధించారని పేర్కొన్నారు.

**కళాశాల టాపర్‌గా అఖిల**

విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ ప్రదానం చేశారు. సిఎస్ఈ--డీఎస్ విభాగానికి చెందిన అనెమోని అఖిల 9.17 సీజీపీఏతో కళాశాల టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఐటీ, సిఎస్ఈ, ఈసీఈ, ఏఐ అండ్ ఎంఎల్, సివిల్, మెకానికల్, ఈఈఈ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేయగా, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి సిల్వర్ మెడల్స్ ప్రదానం చేశారు.

**పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట**

సంస్థలో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గత ఐదేళ్లలో అధ్యాపకులు 607 పరిశోధనా పత్రాలు ప్రచురించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే సుమారు 209 ప్రచురణలు నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది సంస్థకు 30 పేటెంట్లు లభించాయని, ఏఐసీటీఈ ద్వారా రూ.90 లక్షల నిధులతో ఐడియా ల్యాబ్ మంజూరైనట్లు వెల్లడించారు.

డీజీసీఏ ద్వారా డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రంగా గుర్తింపు పొందిన సంస్థలో ఇప్పటికే 41 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసి లైసెన్సులు పొందారని తెలిపారు. ప్లేస్‌మెంట్లలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి 2025--26లో అత్యధికంగా రూ.19 లక్షల సీటీసీ ప్యాకేజీ సాధించారని, సుమారు 50 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ అరిమండ వర ప్రసాద్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ అరిమండ సిద్ధార్థ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ అరిమండ విజయ శారద రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ అరిమండ ప్రీతి రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాధాకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్లు గ్రాడ్యుయేషన్ ఓత్ స్వీకరించి, తమ వృత్తి జీవితంలో నైతిక విలువలు, వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# నరసన్నపేటలో తాగునీటి ఎద్దడి: 15 రోజులుగా అందని నీరు

శ్రీకాకుళం జిల్లా/నరసన్నపేట,ఆగస్ట్ 29పల్లె వెలుగు, నరసన్నపేట పంచాయ తీ పరిధిలో గత పదిహేను రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో స్థానిక ప్రజలు తీవ్ర




ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా గాంధీనగర్, ఇందిరానగర్, హడ్కో కాలనీ, వంశధార కాలనీ తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో నామమాత్రంగా, అత్యల్ప ప్రవాహంతో నీరు వస్తుండటంతో రోజుకు రెండు బిందెలు నిండటం కూడా గగనమైపోతోందని స్థానికులు వాపోతున్నారు. వంట చేయడానికి, పాత్రలు తోముకోవడానికి, స్నానాలకు మరియు ఇతర నిత్యవసర అవసరాలకు నీరు లేక కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పంచాయతీ ఈవో జగన్మోహన్‌ను వివరణ కోరగా, తాగునీటి సరఫరా అంతరాయంపై విచారణ చేపట్టి, సమస్య ఉన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, సరైన సమయానికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని నరసన్నపేట ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అగనంపూడి శ్రీ కృష్ణాష్టమి పోస్టర్ను ఆవిష్కరించిన బలిరెడ్డి

అగనంపూడి, ఆగస్ట్29పల్లె వెలుగు, సెప్టెంబర్ 4వ తేదీన అగనంపూడి ఆర్ హెచ్ సి



సెట్ 3 దిబ్బపాలెం లో వెలిచి ఉన్న రాధాకృష్ణ ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి మహోత్సవాల పోస్టర్ను ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అవిష్కరించారు ఆలయ కమిటీ చైర్మన్ యలమంచిలి పెద అప్పారావు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి మహోత్సవము నాడుఆలయం పరిశుభ్రం చేసి ఉదయాన్నే స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దర్శనాలు మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన సాయంత్రం 5 గంటలకు ఉట్ల సంబరాలు జరుగును కావున పుర ప్రజలు యావన్మంది విచ్చేసి స్వామివారి అనుగ్రహం పొంది ఈ కార్యక్రమం జయప్రదం చేస్తారని కోరుతున్నాను గ్రామ ప్రతినిధులు బొట్ట గంగరాజు కొల్లిదేముడు యలమంచిలి బుల్లి ఉరుకుటి రమేష్ పాల్గొన్నారు.

# పుత్తూరు SRS డిగ్రీ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు.

పుత్తూరు,ఆగష్టు 29పల్లె వెలుగు, స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు'తెలుగు



భాషా దినోత్సవం గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ.. ఆ రోజు నుంచి ఈరోజు వరకు తెలుగు భాష స్థితిగతులను వాటి పూర్వపరాలను విశ్లేషించి వివరించడం జరిగింది . తెలుగు ప్రధాన అధ్యక్షులు సంక్రాంతి రాజేంద్రుడు మాట్లాడుతూ... పిడుగు రామ్మూర్తి పంతులు జీవిత చరిత్ర ఆయన తెలుగు భాషకు, సవర భాషకు చేసినటువంటి కృషి, ఆయన ఆరోజు కుదురుకున్నటువంటి ప్రధాన ఘట్టాలు, గ్రాంధిక వాదులుతో జరిగిన వాదోపవాదాలు తెలుగు భాష వాడుక భాషగా రావడానికి గల కారణాలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన రవి గారు (కార్వేటి నగరం కాలేజీ) నన్నయ్య నుంచి అన్నమయ్య దాకా పదబండాగారా లను అత్యంత సునాయసనంగా తెలియజేశారు. అనంతరం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం నుండి జేఎల్ నుంచి ప్రమోషన్ పై మన ఎస్సారెస్ డిగ్రీ కళాశాలలో పిఎస్సార్ సుబ్రహ్మణ్యం గారు జాయిన్ అయి ముఖ్యఅతిథిగా వచ్చి గిడుగు రామ్మూర్తి పంతులు ప్రతిభ పాటవాలు అందుకొని సత్కారాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, ప్రభాకర్ రావు, నాగేశ్వరరావు,బాబు,శ్రీదేవి, కోటేశ్వరరావు,రామానుజులు రఘురాము,వీరయ్య బాబు, మొదలైన అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

# నగిరిలో వైకాపాకు షాక్: తెదేపాలో చేరిన సీనియర్ నేత రమేష్ రాజు

నగరి / వడమాలపేట, ఆగస్ట్ 29పల్లె వెలుగు, తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ వసంత



నగర్‌కు చెందిన వైకాపా సీనియర్ నాయకులు ముద్దులూరు రమేష్ రాజు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆయన తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయనకు పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్ రాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు. నగిరి నియోజకవర్గ సమగ్ర ప్రగతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నాయకత్వంలో పనిచేసేందుకే తాను తెదేపాలో చేరినట్లు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెచ్ఐవిపై యువతకు అవగాహన తప్పనిసరి

పిఠాపురం, ఆగస్ట్ 29పల్లె వెలుగు, పట్టణంలో శ్రీఆదర్శ ఉమెన్స్ జూనియర్ కళాశాలలో 'చేంజెస్'





స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, హెచ్ఐవి వ్యాప్తి, నివారణ చర్యలు, చికిత్స, మరియు ఎయిడ్స్ యాక్ట్-2017 గురించి విద్యార్థినులకు వివరించారు. బాధితుల పట్ల వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో మెలగాలని సూచించారు. అనంతరం అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.ఎన్. వసంత్ ప్రసాద్, ప్రిన్సిపాల్ టి.వి. రమేష్ చంద్ర, సంస్థ ప్రతినిధులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com